
సాక్షి ఒడిశా

బుధవారం । 5 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలక వర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,36,757లు, బంగారం 1.94గ్రాములు, వెండి 35.83గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



మంగళ ప్రదాయిని మజ్జిగౌరి

- 8లో



ముగిసిన తరతరణి చైత్రోత్సవాలు

- 8లో

న్యూస్‌రీల్‌

40కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ఎంవీ 18గ్రామం కూడలి వద్ద సోమవారం రాత్రి పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న ఎస్‌ఐ సర్వేశ్వర భొయి, సిబ్బంది అక్రమంగా తరలిస్తున్న 40కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బైక్‌ అతి వేగంగా వస్తున్న వ్యక్తిని అడ్డుకొని, తనిఖీ చేయగా ఇది బయట పడిందన్నారు. దీనికి సంబంధించి నిందితుడు కలిమెల సమితి ఎంవీ 40 గ్రామానికి చెందిన సోపాన్‌ మండాల్‌(31), ఎంపీవీ-8 గ్రామానికి చెందిన విశ్వజిత్‌ బేపారీ(34)ను అరెస్ట్‌ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి, నిందితులను మంగళవారం ఉదయం కోర్టులో హాజరు పరిచారు.

మహిళా ఖైదీలకు కుట్టుమిషన్లు పంపిణీ



కుట్టు మిషన్లు అందిస్తున్న ఎస్‌డీసీ సలహాదారుడు ప్రదీప్‌ మాఝి

కొరాపుట్‌: నవరంగ్‌పూర్‌ జిల్లా కేంద్రంలోని సబ్‌ జైలులో ఉన్న మహిళా ఖైదీలకు రాష్ట్ర స్పెషల్‌ డెవలప్‌మెంట్‌ కౌన్సిల్‌ సలహాదారుడు ప్రదీప్‌ మాఝి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా వయోజన విద్య కోసం డిజిటల్‌ బ్లాక్‌ బోర్డు అందజేశారు. ఈ సందర్భంగా ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే వారికి ఉపాధి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జైలు సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో బీజేడీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు భూమిపూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సరక

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌ సబ్‌ డివిజన్‌ పరిధి నైరా నుంచి బైనగుడ వరకు సుమారు 9.5కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులకు రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక మంగళవారం భూమిపూజ చేశారు. దీనికి సంబంధించి సుమారు రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. వాహన రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా, ట్రాఫిక్‌ సమస్యలను తొలగించేందుకు విస్తరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మౌలిక వసతులు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ క్రమంలో గత కొన్నాళ్లుగా ఈ ప్రాంత ప్రజలు రోడ్డు విస్తరణ కోసం డిమాండ్‌ చేస్తుండే వారని, నిధులు మంజూరు కావడంతో త్వరలో పనులు చేపడతామని వివరించారు. కార్యక్రమంలో గుణుపూర్‌ ఎమ్మెల్యే రఘునాథ్‌ గమాంగొ, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా పరిషత్‌ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌దాస్‌, నాయకులు కేదార్‌ సాహు పాల్గొన్నారు.

కోడలు చిన్న కాళికా అమ్మవారికి పిలుపు



మాబుడి శాంతమ్మను దర్శించుకుంటున్న భక్తులు

బరంపురం: నగర ప్రజల గ్రామ దేవతలు మాబుడి శాంతమ్మ, కోడలు చిన్నా కాళికా అమ్మవారి ఉత్సవాలు మంగళవారం అర్ధరాత్రి ప్రారంభమయ్యాయ. ఈ నేపథ్యంలో సంబరాల నిర్వహకులు దేశిబెహరా దుర్గాప్రసాద్‌ ఉదయం మంగళవాయిద్యాల నడుమ దేశిబెహరా ఇంటి నుంచి ఊరేగింపుగా బయలుదేరారు. సంప్రదాయం ప్రకారం తొలుత కోడలు చిన్న కాళికా అమ్మవారి ఆలయానికికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు.

జపాన్‌ చేరుకున్న సీఎం నవీన్‌

- సాదరంగా ఆహ్వానించిన భారత రాయబారి సీబీ జార్జ్‌
- జపనీయులు అత్యంత ఆత్మీయులు: ముఖ్యమంత్రి
- తొలి రోజు నిప్పన్‌ స్టీల్‌ అధ్యక్షుడితో భేటీ ఫలప్రదం
- రాష్ట్రంలో అతిపెద్ద స్టీల్‌ప్లాంట్‌ ఏర్పాటుకు అంగీకారం



టోక్యోలో పారిశ్రామిక దిగ్గజాలతో రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి ప్రతాప్‌కేశరి దేవ్‌



జపాన్‌లో సీఎం నవీన్‌ పట్నాయక్‌కు సాదరంగా స్వాగతం పలుకుతున్న భారత రాయబారి సీబీ జార్జ్‌

భువనేశ్వర్‌: ఒడిశాలో పెట్టుబడి అవకాశాలను ప్రోత్సహించేందుకు ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ జపాన్‌ చేరుకున్నారు. ఇందులో పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈ, విద్యుత్‌శాఖ మంత్రి ప్రతాప్‌కేశరి దేవ్‌, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్‌, సాంకేతిక సమాచారం, క్రీడలు, యువజన వ్యవహారాల ప్రిన్సిపల్‌ సెక్రటరీలు, ఇపికాల్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ ఉన్నారు. రాష్ట్ర వ్యాపార ప్రతినిధి బృందంలో స్టీల్‌, అల్యూమినియం, టెక్స్‌టైల్స్‌, ఫుడ్‌, సీఫుడ్‌ ప్రాసెసింగ్‌, గ్రీన్‌ హైడ్రోజన్‌, గ్రీన్‌ అమ్మోనియా రంగాలకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు వెంట వెళ్లారు. ఈ వర్గాలు జపాన్‌ పెట్టుబడిదారులతో సహకారం కోసం అవకాశాలను అన్వేషిస్తారు. టోక్యో చేరుకున్న సందర్భంగా సీఎం మాట్లాడుతూ, తన పర్యటన జపాన్‌-ఒడిశా మధ్య సంబంధాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. ఉభయ దేశాల ప్రయోజనాలకు అక్కరకు వచ్చే అవకాశాల సమన్వయానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రతినిధి బృందానికి జపాన్‌ ప్రభుత్వం, ప్రజలు అందించిన ఆప్యాయత, ఆతిథ్యానికి ప్రశంసలు తెలియజేశారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జపాన్‌, ఒడిశా మధ్య సన్నిహిత సంబంధాలను పెంపొందించడానికి జపాన్‌ పర్యటన అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ప్రధానంగా వర్తక వ్యాపారాలు, పారిశ్రామిక, ఉత్పాదన రంగాల్లో పెట్టుబడులకు ఒడిశా అనుకూలమైన ప్రదేశంగా జపానీయుల్లో విశ్వసనీయత బలోపేతం చేసేందుకు గట్టి పునాది వేస్తుందని ప్రగాఢ విశ్వాసం వ్యక్తంచేశారు.

పర్యటన వివరాలు..

రాష్ట్ర అధికార బృందం పర్యటనలో తొలి రోజు మంగళవారం నిప్పన్‌ స్టీల్‌ కార్పొరేషన్‌ వర్గాలతో సహకార, సమన్వయ చర్చలు జరిపారు. నిప్పన్‌ ప్రతినిధి, ప్రెసిడెంట్‌ ఎయిజీ హషిమోటోతో సమావేశం కావడంతో పారిశ్రామిక రంగం పెట్టుబడులను ఆకట్టుకోవడంలో తొలి ప్రయత్నంగా అధికారులు తెలియజేశారు. అలాగే రెండో రోజు బుధవారం టోక్యో ఓకురాలో ఒడిశా బిజినెస్‌ మీట్‌-2023 నిర్వహణకు షెడ్యూలు ఖరారు చేశారు. ఈ సదస్సుకు జపాన్‌, ఇండో-పసిఫిక్‌ ప్రాంతం నుంచి సుమారు 200మందికి పైగా పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పెట్టుబడిదారులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అలాగే ఒడిశాలో కొనసాగుతున్న, అభివృద్ధి చెందుతున్న విస్తృత వ్యాపార అవకాశాలను ప్రదర్శిస్తారు. సాయంత్రం జపాన్‌లోని ఒడియా ప్రవాసులతో ప్రతిస్పందన కార్యక్రమంలో పాల్గొంటారు. ఈనెల 6న రాష్ట్ర ప్రతినిధి బృందం కిమిట్సు స్టీల్‌వర్క్స్‌, నిప్పన్‌ స్టీల్‌ కార్పొరేషన్‌ పరిశోధన, అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ) కేంద్రాలను సందర్శిస్తారు.

ఇప్పటికే కొన్ని ఒప్పందాలు..

గత ఏడాది డిసెంబర్‌లో మేక్‌ ఇన్‌ ఒడిశా కాన్‌క్లేవ్‌ జరిగిన నెల రోజుల అనంతరం రూ.38,000 కోట్ల పెట్టుబడితో జగత్సింగ్‌పూర్‌లో 7ఎంటీపీఏ సామర్థ్యంతో ఉక్కు కర్మాగారం నెలకొల్పేందుకు ఏఎంఎన్‌ ఇండియా లిమిటెడ్‌ ప్రతిపాదనను ఒడిశా ప్రభుత్వం ఆమోదించింది. భువనేశ్వర్‌ కళింగ స్టేడియంలో హై-పెర్ఫార్మెన్స్‌ జిమ్నాస్టిక్స్‌ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో మరో ఒప్పందం ఖరారు కానున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. పారాదీప్‌లో ఆర్సెలార్‌ మిట్టల్‌ నిప్పన్‌ స్టీల్‌ ఇండియా లిమిటెడ్‌ 12ఎంటీపీఏ సామర్థ్యంతో పెల్లెట్‌ ప్లాంట్‌ను నిర్వహిస్తోంది. ఇది దేశంలోనే అతిపెద్ద సింగిల్‌ లొకేషన్‌ పెల్లెట్‌ కాంప్లెక్స్‌గా నిలిచింది.

28,000 మందికి ఉపాధి



నిప్పన్‌ స్టీల్‌ ప్రెసిడెంట్‌ ఈజీ హషిమోటోతో చర్చిస్తున్న సీఎం నవీన్‌ పట్నాయక్‌, పక్కన 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్‌

రాష్ట్రంలో అతిపెద్ద అధునాతన స్టీల్‌ప్లాంట్‌ను నిర్మించాలని తమ కంపెనీ యోచిస్తోందని నిప్పన్‌ స్టీల్‌ ప్రెసిడెంట్‌ ఈజీ హషిమోటో ప్రకటించారు. ఒడిశాలో 30మిలియన్‌ టన్నుల వార్షిక ఉత్పాదన(ఎంటీపీఏ) ఉత్పత్తి సామర్థ్యంతో ఈ సంస్థలు ఏర్పాటు అవుతాయని తెలిపారు. జపాన్‌ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌తో మంగళవారం సాయంత్రం టోక్యో జరిగిన సమావేశంలో ఆయన ఈ ప్రకటన చేశారు. హషిమోటోతో పాటు ఆయన బృందం ఒడిశాలో పర్యటించాల్సిందిగా ఈ సందర్భంగా సీఎం ఆహ్వానించారు. పైప్‌లైన్‌లో ఉన్న పలు ప్రాజెక్టులు రాష్ట్రంలోని పెద్ద సంఖ్యలో ప్రజలకు సహాయపడతాయన్నానరు. ఆర్సెలర్‌ మిట్టల్‌, నిప్పన్‌ స్టీల్‌ జాయింట్‌ వెంచర్‌(ఏఎంఎన్‌) ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్రంలో రెండు ఉక్కు కర్మాగారాల ఏర్పాటుకు కుదిరిన ఒప్పందాలను త్వరగా ప్రారంభించడంపట్ల ఇరువర్గాల మధ్య చర్చ సాగింది. ఈ ప్రాజెక్టుతో 28,000మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. దీంతో ఈ భేటీ ఫలప్రదంగా ముగిసింది. 2021లో కేంద్రాపడా జిల్లాలో రూ.50,000 కోట్ల పెట్టుబడితో సంవత్సరానికి 12మిలియన్‌ టన్నుల వార్షిక ఉత్పాదన(ఎంటీపీఏ) సామర్థ్యంతో ఇంటిగ్రేటెడ్‌ స్టీల్‌ప్లాంట్‌ ఏర్పాటుకు ఆర్సెలర్‌ మిట్టల్‌, నిప్పన్‌ స్టీల్‌ జాయింట్‌ వెంచర్‌ ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది.

బీఈఓ కార్యాలయం ముట్టడి



కుంద్రా బీఈఓ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

- ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తుల డిమాండ్‌

జయపురం: సబ్‌ డివిజన్‌ పరిధి కుంద్రా సమితి కేంద్రంలోని ఉన్నత ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై గ్రామస్తులు బ్లాక్‌ విద్యాధికారి కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. అనంతరం బీఈఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు మొత్తం 227మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. అయితే హెచ్‌ఎంతో సహా ఐదుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉండటంతో గుణాత్మక విద్య కరువైందని వాపోయారు. మొత్తం 8తరగతులకు నలుగురే ఎలా పాఠాలు చెబుతారని ప్రశ్నించారు. విద్యార్థుల చదువులు సక్రమంగా సాగడం లేదని గతంలోనే పలుమార్లు అధికారులకు తెలియజేసినా ప్రయోజనం లేకపోయిందని విచారం వ్యక్తంచేసారు. ఇప్పటికైనా స్పందించి, సమస్య పరిష్కారాని చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థుల చదువులకు సహకరించాలను కోరారు. దీనిపై బీఈఓ బెహరా మాట్లాడుతూ పాఠశాలలో నిష్పత్తి ప్రకారమే ఉపాధ్యాయులు ఉండేవారని, వీరిలో ఒకరు పదోన్నతిపై, మరొకరు డెప్యుటేషన్‌పై వెళ్లిపోవడంతో కొరత ఏర్పడిందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి నియామకాలకు చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్‌ కమిటీ అధ్యక్షుడు రాజేష్‌ హరిజన్‌, సభ్యులు లక్ష్మణ్‌ మాటపడియ, బిజయకుమార్‌ గురు, కనకలత పెంటియ, రామకృష్ణ సెఠి, మీనా కార్తీక్‌ తదితరులు పాల్గొన్నారు.

హడ్డుబంగిలో కొనసాగుతున్న నవమి ఉత్సవాలు



స్వామివారిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్‌, హైటెక్‌ చైర్మన్‌

పర్లాకిమిడి: జిల్లాలోని కాశీనగర్‌ బ్లాక్‌ హడ్డుబంగి గ్రామంలో ఉన్న కోదండ సీతారామస్వామి ఆలయంలో శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం జరిగిని కార్యక్రమంలో జిల్లా పరిషత్‌ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, హైటెక్‌ విద్యాసంస్థల చైర్మన్‌, బీజేడీ సీనియర్‌ నాయకులు తిరుపతి పాణిగ్రాహి, యువనేత రూపేష్‌ పాణిగ్రాహి, ఆర్‌ఎంసీఎస్‌ అధ్యక్షుడు ఎస్‌.గజపతిరావు, కాశీనగర్‌ బ్లాక్‌ అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, గుసాని బ్లాక్‌ అధ్యక్షుడు ఎన్‌.వీర్రాజు, జెడ్పీటీసీ ఎస్‌.బాలరాజు, నాయకులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యాక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు.

బీజేడీ పరిశీలకులు వీరే



డాక్టర్‌ ప్రసన్న ఆచార్య



దేవీప్రసాద్‌ మిశ్రా



శారదాప్రసాద్‌ నాయక్‌

భువనేశ్వర్‌: ఝార్సుగుడ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికకు పార్టీ పరిశీలకుల పేర్లను బిజూ జనతాదళ్‌ (బీజేడీ) మంగళవారం ప్రకటించింది. మే 10న జరగనున్న ఉప ఎన్నికకు పార్టీ సీనియర్‌ నేతలు డాక్టర్‌ ప్రసన్నకుమార్‌ ఆచార్య, దేవీప్రసాద్‌ మిశ్రా, శారదాప్రసాద్‌ నాయక్‌లను నియమించినట్లు బీజేడీ ఆర్గనైజింగ్‌ సెక్రటరీ ప్రణబ్‌ప్రకాష్‌ దాస్‌ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ ఏడాది జనవరి 29న మాజీ ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి నవకిషోర్‌ దాస్‌ మరణంతో ఝార్సుగుడ అసెంబ్లీ స్థానం ఖాళీ అయ్యింది. ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు బీజేడీ అభ్యర్థిగా నవకిషోర్‌ దాస్‌ కుమార్తె దీపాలి దాస్‌ను ప్రకటించి, ఉప ఎన్నిక బరిలోకి దింపింది.

పొనా సంక్రాంతి వేదికపై వివాదం

- అభ్యంతరం వ్యక్తం చేసిన దళితసంఘ నాయకులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

రాయగడ: పట్టణంలోని గోవింద చంద్రదేవ్‌ ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 14న ఒడియా ప్రజల నూతన సంవత్సరం పొనా సంక్రాంతి(మహా విశుభ మిలన్‌) ఉత్సవాలను నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నిరంజన్‌ బక్షిపాత్రో ఆధ్వర్యంలో మైదానంలో ముహూర్తపు రాట కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అయితే ఇదే మైదానంలో దళిత వర్గాలకు చెందిన నాయకులు ఏప్రిల్‌ 14న రాజ్యాంగ నిర్మాత బీఆర్‌ అంబేడ్కర్‌ జయంతి వేడుకలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనిపై తమకు అనుమతి ఇవ్వాల్సిందిగా జిల్లా యంత్రాంగానికి విన్నవించుకున్నారు. అయితే దీనిపై అధికారులు ససేమిరా అంగీకరించక పోవడంతో అదే స్థలంలో పొనా సంక్రాంతి వేడుకలు నిర్వహించేందుకు ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. ఒకేరోజు ఇరువర్గాలు అనుమతి కోసం జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించగా.. పొనా నిర్వహకులకు ఎలా అనుమతిచ్చారని నిలదీశారు.

అదే రోజు జయంతి వేడుకలు..

ఈ మేరకు దళిత సంఘాల నాయకులు గంగాధర్‌ పువ్వల, హరప్రసాద్‌ హెప్రుక, ప్రతాప్‌ పువ్వల, సంధ్యా పులక తదితరులు రాయగడలోని హోటల్‌ తేజస్వినిలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. విద్యాసంస్థకు చెందిన మైదానంలో ఎటువంటి ధార్మిక సభలు, సమావేశాలు, మెలోడీ షోలు నిర్వహించకూడదని హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ పొనా వేడుకలకు జిల్లా యంత్రాంగం అనుమతిచ్చిందని ఆరోపించారు. మైదానంలో సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తే.. తాము కూడా అదే స్థలంలో అంబేడ్కర్‌ జయంతి ఉత్సవాలను నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ వివాదంపై జిల్లా యంత్రాంగం సత్వర చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌ చేశారు. లేనిపక్షంలో దళిత సంఘాలంతా ఏకమై, నిరసన తెలియజేస్తామని వెల్లడించారు.



గోవింద చంద్రదేవ్‌ ఉన్నత పాఠశాల మైదానంలో ముహూర్తపు రాట పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

• భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న దీక్షలు



గాంధీనగర్‌లో పూజలందుకుంటున్న దొండకాళీ అమ్మవారు



దీక్షల్లో భాగంగా నృత్యం చేస్తున్న భక్తులు

బరంపురం: గంజాం జిల్లాలో ప్రసిద్ధి చెందిన దొండనాచో కఠోర దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సోమ, మంగళవారాల్లో దీక్షాధారులు నగరంలోని గాంధీనగర్‌, హరడాఖండి, సిటీ హాస్పిటల్‌ రోడ్డు, పాడు వీధుల్లో ప్రదర్శనలు జరిగాయి. సంప్రదాయాలకు అనుగుణంగా మిట్ట మధ్యాహ్నం ఎండలో కఠోర దీక్షలు, గడ్డి ఉండలతో అగ్నికీలల ప్రదర్శనలు చేపట్టారు. ఉదయం అంతా ఉపవాసం ఉన్న దీక్షాధరులు సాయంత్రం చెరువుల్లో స్నానం చేసి, ప్రసాదం స్వీకరించారు. రాత్రి దొండకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అనంతరం వివిధ సాంస్కృతిక నాటకల ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.



మిట్ట మధ్యాహ్నం రోడ్డుపై దీక్షలు చేపడుతున్న దీక్షాధరులు

క్లుప్తంగా

దేవస్థాన కమిటీలలో ఒడిశా ప్రతినిధులను చేర్చాలి

- జయపురం తెలుగు కళాస్రవంతి ప్రతినిధుల డిమాండ్



బాబి దాస్‌కు వినతిపత్రం అందిస్తున్న రాంబాబు, దుర్గాశర్మ

జయపురం: ఆంధ్రప్రదేశ్ లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు సింహాచలం, తిరుపతి దేవస్థాన కమిటీలలో ఒడిశాకు చెందిన ప్రతినిధులను స్థానం కల్పించాలని జయపురం తెలుగు కళాస్రవంతి సభ్యులు కోరారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు జి.రాంబాబు, జయపురం మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మన్ దుర్గాప్రసాద్ శర్మ, వాసుదేవరావు, జి.లక్ష్మి, జయపురం తెలగదొర సంఘం ప్రతినిధి ఎ.మహేష్ దొర తదితరులు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ పేరిట రాసిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి, ఎమ్మెల్యే బాబి దాస్‌కు అందజేశారు. ఆయనను రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో మంగళవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేడీ కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు, కేసీసీ బ్యాంక్ చైర్మన్ ఈశ్వరచంద్ర పాణిగ్రాహితో కలిసి మాట్లాడారు. తమ ప్రతిపాదనను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి పంపించాలని కోరారు. ఆ రాష్ట్రంలో సింహాచలం, తిరుపతి దేవస్థాన కమిటీలలో వివిధ రాష్ట్రాలకు చెందని సభ్యులను నామినేట్ చేస్తున్నారని, దీనిని ఒడిశాకు వర్తింపజేయాలని విన్నవించారు. అలాగే ఒడిశాలో తెలుగు వారు ప్రధానంగా జరుపుకొనే సంక్రాంతి, ఉగాది పండగలకు రాష్ట్రప్రభుత్వం సెలవు దినాలుగా ప్రకటించాలని కోరుతూ బాబిదాస్‌కు వినతిపత్రం అందజేశారు.

పర్లాకిమిడిలో పిడుగుల వర్షం

పర్లాకిమిడి: పట్టణంలో సాయంత్రం 5గంటల సమయంలో పిడుగులతో కూడిన వర్షం పడింది. ఉదయం అధిక ఉష్ణోగ్రత నమోదు కాగా, సాయంత్రం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడింది. మరో 2రోజుల పాటు కాలవైశాఖి ప్రభావం జిల్లాకు ఉందని వాతావరణ నిపుణులు తెలిపారు.

నేడు ద్విచక్రవాహనాల వేలం

పాతపట్నం: ప్రహరాజపాలేంలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) ఆధ్వర్యంలో వివిధ కేసుల్లో పట్టుబడిన బైక్‌లను ఈ నెల 5వ తేదీ బుధవారం ఉదయం పది గంటలకు ప్రహరాజపాలేంలోని ఎస్‌ఈబీ స్టేషన్ వద్ద వేలం వేయనున్నట్లు ఎస్‌ఈబీ సీఐ వై.లక్ష్మినాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 5వ తేదీ ఉదయం 9గంటలకు ఆధార్ జిరాక్సుతో పాటు రూ.1000 ముందస్తుగా చెల్లించి, వేలంలో పాల్గొనవచ్చునని సీఐ పేర్కొన్నారు.

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో పూర్తిస్థాయిలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎస్పీ జీఆర్ రాధిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగం అధికారులను ఆదేశించారు. ఆమె మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో జాయింట్ డైరెక్టర్ ఎంవీ నాగమణికంఠతో కలిసి నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో సెబ్, పోలీసు శాఖ సమన్వయంతో పనిచేసి సరిహద్దు ప్రాంతాల నుంచే కాకుండా జాతీయ రహదారులు, మారుమూల ప్రాంతాల్లో గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. పార్సిల్ సర్వీసెస్, ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు తరచూ తనిఖీ చేసి ఎలాంటి అక్రమ రవాణాకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పార్సిల్ క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అనుమతించేలా, రికార్డులు పక్కాగా ఉండేలా నిర్వాహకులు చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. ప్రతి అంశాన్ని రికార్డుల్లో పొందుపర్చాలన్నారు. గ్రామాల్లో నాటుసారా విక్రయాల కేంద్రాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో రైడ్స్, కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించి నాటుసారా తయారీకి వినియోగించే ముడి పదార్థాలు అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కేపీ గోపాల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కాలువలో కారు

పోలాకి: మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న గంగివలస వద్ద వంశధార కాలువలో ఉదయం ఒక కారు దర్శనమిచ్చింది. సోమవారం రాత్రి పోలాకి వైపు నుంచి పిన్నింటిపేట వైపు వెళ్తున్న ఒక కారు అదుపు తప్పి కాలువలో పడిపోయింది. మంగళవారం ఉదయం కారును బయటకు తీసి తరలించేశారు. దీనిపై ఎస్ఐ నర్సింహమూర్తి వద్ద ప్రస్తావించగా దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు. కొందరు యువకులు మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తూ అతివేగంతో కారు నడపటం వల్లనే ఇలా జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

మంగళ ప్రదాయిని మజ్జిగౌరి

- నేడు ఉత్సవాల ముగింపు
- మంగళవారం పోటెత్తిన భక్తులు



అమ్మవారికి సిద్ధం చేసిన ప్రత్యేక నైవేద్యం



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



పూజలందుకుంటున్న మజ్జిగౌరి అమ్మవారు

రాయగడ: కోర్కెలు తీర్చే చల్లని తల్లి మజ్జిగౌరి చైత్రోత్సవాలు తుది దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన రోజు కావడంతో పసుపు, కుంకుమతో పాటు ప్రత్యేకంగా తయారు చేసిన గోదుమ రవ్వతో తయారు చేసే కక్కరాలను నైవేద్యంగా సమర్పించారు. మంగళప్రదాయిని అయిన అమ్మవారు తమ సౌభాగ్యాన్ని కలకాలం కాపాడాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ప్రారంభించిన చండీహోమం కొనసాగుతోంది. కమిటీ సభ్యులు నియమనిష్టలతో పాల్గొని, ఈ కార్యక్రమాన్ని జరిపిస్తున్నారు. ప్రపంచ శాంతికి ఈ హోమం దోహద పడటంతో పాటు దుష్టశక్తులు ఏవీ గ్రామంలోకి చొరబడకుండా ద్వారా అమ్మవారిని రక్షా రూపిణిగా ఆహ్వానించారు. బుధవారం పూర్ణాహుతితో ఈ కార్యక్రమం ముగుస్తుందని కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు మల్లెలు తొక్కడం..

గత 5రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాలు బుధవారంతో ముగుస్తాయి. ఆఖరి రోజున మెల్లెలు(నిప్పులు) తొక్కు కార్యక్రమంతో ముగింపు పలకనుండగా, దీనిని సన్నాహాలు పూర్తయ్యాయి. మందిరం ప్రాంగణంలోని మైదానాన్ని చదును చేశారు. సాయంత్రం 5 గంటలకు మందిర పురోహిత బృందం పూజా కార్యక్రమాలను పూర్తిచేసి, అగ్ని వెలిగిస్తారు. అనంతరం పెద్ద పెద్ద దుంగలతో మంటలు వేసి నిప్పులుగా రూపొందిస్తారు. నగర పరిక్రమణ పూర్తయిన అనంతరం ఘటాలను తీసుకు వచ్చిన పూజారులు.. ఈ నిప్పులపై నడుస్తారు. ఈ ప్రక్రియను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. అలాగే అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు తమపై ఎటువంటి దుష్టశక్తుల ప్రభావం లేకుండా మందిరంలో పూజలు చేసిన తాయెత్తులను కట్టుకుంటారు. పూజారులు ప్రత్యేకంగా తయారు చేసి వీటిని విక్రయిస్తారు.



విక్రయాలకు సిద్ధంగా ఉన్న తాయెత్తులు

రోడ్డు భద్రతపై కలెక్టర్ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ లింగరాజ్ పండా

పర్లాకిమిడి: జిల్లాలోని రహదారుల భద్రతపై కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ లింగరాజ్ పండా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు, ఆర్‌టీఓ తరచూ సిబ్బంది ఉమ్మడిగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు రోడ్డు రవాణాశాఖ నో యాక్సిడెంట్ వీక్‌ను నిర్వహించాలని, హెల్మెట్ ధరించడం, అతివేగం, మైనర్లతో డ్రైవింగ్ నివారించడం, డ్రంక్ ఇన్ డ్రైవ్, ప్రయాణంలో సెల్ ఫోన్ వినియోగం తదితర విషయాలపై దృష్టి సారించాలన్నారు. అలాగే జిల్లా రవాణాశాఖ అధికారి శంతనుకుమార్ పరిడా గత 3నెలల్లో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదాలపై నివేదికను వినిపించారు. 2023 జనవరి నుంచి మార్చి వరకు మోహానా, అడవ, రామగిరి, సెరంగో, రాయఘడ్, కాశీనగర్, గురండి, గారబంద, పర్లాకిమిడి పోలీసు స్టేషన్ల పరిధిలో మొత్తం 35 ఎంవీ కేసులు రిజిస్టర్ అయ్యాయని పేర్కొన్నారు. ఈ ఘటనల్లో 17మంది చనిపోగా, 13మందికి స్వల్పగాయాలు, 31మందికి తీవ్ర గాయాలు అయ్యాయని వెల్లడించారు. అదనపు ఎస్పీ వామదేవ్ సింగ్, ఎస్డీపీఓ రామకృష్ణ పతి, రోడ్లు, భవనాలశాఖ సూపరింటెంటెంట్ శ్రీకాంత్ సామల్, ఎంవీఐ, ఎలక్ట్రికల్ ఈఈ తదితరులు పాల్గొన్నారు.

పూరీ చేరిన ఈవీఎంలు

భువనేశ్వర్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం) మంగళవారం పూరీకి చేరాయి. హైదరాబాద్ ప్రాసెసింగ్ యూనిట్ నుంచి కట్టుదిట్టమైన భద్రతతో 6 ట్రంకు పెట్టెల్లో రవాణా చేశారు. 630 ట్రంకు పెట్టెల్లో 8,200 ఈవీఎంలు వచ్చాయి. వీటిలో 4,100 బ్యాలెట్ యూనిట్లు, 4,100 కంట్రోల్ యూనిట్లు ఉన్నాయి. పూరీ తాలా బొణియా ప్రాంతంలోని స్ట్రాంగ్ రూంలో వీటిని భద్ర పరిచారు. ఈ చర్యలో భాగంగా ప్రత్యేకంగా 28గదులను ఏర్పాటు చేశారు. మరో 5వేల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు త్వరలో రానున్నట్లు సమాచారం సార్వత్రిక ఎన్నికలకు దాదాపు ఏడాది సమయం ఉండగా.. ఇంత భారీ ఎత్తున ఓటింగ్ యంత్రాలు రావడం నగరంలో చర్చనీయాంశమైంది.



పెట్టెల్లో తీసుకు వచ్చిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు



స్ట్రాంగ్ రూం వద్ద ఈవీఎంలు భద్రతా పర్యవేక్షణలో అధికారులు

ముత్యాలమ్మ జాతర ప్రారంభం



పూజలందుకుంటున్న ముత్యాలమ్మ



వంశధార నుంచి నదీ జలాలను తీసుకువస్తున్న కమిటీ సభ్యులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ముత్యాలమ్మ జాతర మంగళవారం ప్రారంభమైంది. గుణుపూర్ ప్రజల ఆరాధ్యదైవంగా కొలవబడుతున్న అమ్మవారి జాతరను గత 24ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. అయితే గత రెండేళ్లు కరోనా కారణంగా పూజలకే పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జాతరను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం పట్టణానికి సమీపంలోని వంశధార నది నుంచి కలశాలతో శుద్ధ జలాలను తీసుకువచ్చిన కమిటీ సభ్యులు.. అనంతరం మందిరం ప్రాంగణంలో ధ్వజస్తంభ ఆరోహణ చేశారు. అమ్మవారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక పూజలను పురోహితులు బి.కిషోర్, ఎం.చిన్న, ఎం.కిషన్, ఎం.రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. 5రోజులు కొనసాగనున్న ఈ జాతరలో రోజూ సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



ధ్వజస్తంభ పూజలు చేస్తున్న దృశ్యం

వైభవంగా దొంగదోపు ఉత్సవం



తోట మండపంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆదిత్యుని కల్యాణమూర్తులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 'దొంగ దోపు ఉత్సవం' ఆకట్టుకుంది. ఆలయ ఉద్యానవన తోటల్లో జరిపించిన ఈ వేడుకల్లో భాగంగా ఆలయం నుంచి ఉత్సవమూర్తులను వెండి సింహ వాహనంపై తిరువీధిగా ఊరేగించి, స్థానిక చిన్న ఉద్యానవన తోటలో ఉంచారు. మరో ఉద్యానవన తోట (పెద్ద తోట)లో శ్రీ తిరుమంగయాళ్వారు చరిత్రలో భాగంగా ఆళ్వారును వేంచేసింపజేశారు. ఈ సందర్భంగా ఆళ్వారుకు, ఆదిత్యునికి మధ్య జరిగిన సంవాదం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. వసంత రుతువులో కల్యాణం అనంతరం స్వామి వారు, తన దేవేరుల సమేతంగా ఉద్యానవనాల్లో విహరించే సందర్భంలో ఆళ్వారు సృష్టించిన పలు ఇబ్బందికర పరిస్థితులపై కలత చెందిన ముగ్గురు భార్యల సూచన మేరకు ఆదిత్యుడు ఆళ్వారుతో సంవాదానికి దిగుతారు. ఈ నేపథ్యాన్ని తీసుకుని ఆదిత్యుని తరఫున భాస్కరభట్ల నర్సయ్యశర్మ, బంకుపల్లి రమేష్‌శర్మ, ఆళ్వారు తరఫున భాస్కరభట్ల శ్రీరామమూర్తి శర్మ, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావులు సంవాదం చేసుకున్నారు. అనంతరం తోట ఉద్యానవనంలో ఉన్న ఆదిత్యున్ని ఉత్సవ కల్యాణమూర్తులకు మహా హారతి, ప్రసాద నివేదన చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆళ్వారు, ఆదిత్యుని వర్గాల మధ్య సంవాదం చేసుకుంటున్న అర్చకులు

నేడు పుష్పయాగం

ఆదిత్యుని కల్యాణ మహోత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి. చైత్ర శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఉదయం కల్యాణ మూర్తులకు చక్రతీర్థ స్నానాలు నిర్వహిస్తారు. సాయంత్రం ధ్వజావరోహణం జరుగుతుందని, రాత్రి పుష్పయాగం నిర్వహిస్తారని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలియజేశారు.

ముగిసిన తరతరణి చైత్రోత్సవాలు

- మహాదుర్గగా దర్శనమిచ్చిన అమ్మవారు



మహాదుర్గ అవతారంలో దర్శనమిస్తున్న తరతరణి అమ్మవారు



అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకుంటున్న భక్తులు

బరంపురం: దక్షిణ ఒడిశా ప్రజల ఆరాధ్యదైవం, రుశికుల్యా నదీ తీరంలో కొలువైన తరతరణి అమ్మవారి చైత్రమాస ఉత్సవాలు వైభవంగా ముగిసాయి. ఉత్సవాల్లో చివరి మంగళవారం కావడంతో అమ్మవారు మహాదుర్గగా దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో ఒడిశాతో పాటు ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం, విజయనగరం జిల్లా నుంచి వేలాది మంది భక్తులు కొండపైకి చేరుకున్నారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు ఎడ్లబళ్లపై జాతరకు చేరుకున్నారు. చిన్నారులు, పెద్దలు తలనీలాలు సమర్పించి, మొక్కుబడులు చెల్లించుకున్నారు. కొండ దిగువున వంటవార్పు చేసుకొని, ప్రత్యేక పూజలు చేశారు. తరతరణి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి మధ్యాహ్నం రాజభోగం, సాయంత్రం సంధ్యా హారతి, రాత్రి బేడా చేపట్టారు. అలాగే ఉత్సవమూర్తులను ప్రత్యేక రథంలో తిరువీధుల్లో ఊరేగించారు. ఆఖరి వారం కావడంతో అమ్మవారి దర్శనానికి సుమారు 4లక్షల మందికి పైగా భక్తులు తరలి వచ్చారని కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి తిరుములకుమార్ రెడ్డి తెలిపారు. శాంతి భద్రతల పర్యవేక్షణకు ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించారు.



పరిసర గ్రామల నుంచి ఎడ్ల బళ్లపై జాతరకు చేరుకుంటున్న ప్రజలు

కెమికల్ పరిశ్రమల్లో
అప్రమత్తత అవసరం



స్మార్ట్ కెం పరిశ్రమలో ప్రమాద సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై డెమో నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: కెమికల్ పరిశ్రమల్లో ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ సుశాంత్ కుమార్ బెహరా అన్నారు. పొన్నాడలోని స్మార్ట్ కెం టెక్నాలజీస్ కెమికల్ పరిశ్రమలో మంగళవారం విపత్తుల ముందస్తు నియంత్రణ, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం, డెమో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కెమికల్ పరిశ్రమల్లో ప్రమాదాలు జరిగితే ప్రాణనష్టంకు అవకాశం ఉంటుందని తెలిపారు. పరిశ్రమల్లో పూర్తిస్థాయిలో అంతర్జాతీయ ప్రమాణాలతో భద్రతా చర్యలు ఉండాలని సూచించారు. భద్రత కిట్ల వినియోగం, అందుబాటులో ప్రాథమిక చికిత్సకు వైద్య సౌకర్యాలు, అన్ని సౌకర్యాలతో అంబులెన్స్ సిద్ధంగా ఉంచటం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, పరిశ్రమ సీనియర్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెండు పూరిళ్లు దగ్ధం



అగ్నికి ఆహుతైన పూరిళ్లను పరిశీలిస్తున్న అధికారులు

కురుపాం: మండలంలోని మొండెంఖల్ పంచాయతీ తాబేలువలస గిరిజన గ్రామంలో సోమవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయని గ్రామానికి చెందిన బాధితులు ఊయక గొయంతి, బిడ్డిక వెంకటరావులు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్ని ప్రమాదం వల్ల ఇంట్లో ఉన్న బట్టలు, సామగ్రి, ఎలక్ట్రిక్‌సామాన్లు, విక్రయించేందుకు ఉంచిన చింత, జీడి సైతం బూడిదయ్యాయని వాపోయారు. విషయం తెలుసుకున్న వీఆర్‌ఓ ఆరుణజ్యోతి, పంచాయతీ కార్యదర్శి వెంకటనాయుడులు గ్రామానికి వెళ్లి పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతిచెందిన నాగరాజు

తెర్లాం: మండలంలోని నెమలాం పంచాయతీ ఆర్.గదబవలస గ్రామంలో మంగళవారం ఉదయం ట్రాక్టర్ బోల్తాపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గురిజా నాగరాజు(38) పొలానికి ట్రాక్టర్ తీసుకుని వెళ్తుండగా స్థానికంగా ఉన్న తోటపల్లి ప్రధాన కుడికాలువ మలుపు వద్ద బోల్తా పడింది. ట్రాక్టర్ నడుపుతున్న నాగరాజుపై ఇంజిన్ పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య కళావతి, కుమారులు మోహన్, సూర్యకుమార్ ఉన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ సంఘటనా స్థలానికి హెచ్‌సీ ప్రసాదరావు, సిబ్బందిని పంపించి పరిస్థితిని సమీక్షించారు. కుటుంబసభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం సీహెచ్‌సీకి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో ముగ్గురికి జైలుశిక్ష

విజయనగరం లీగల్: స్థానిక శ్రీదేవిదండుమారమ్మ ఆలయంలో చోరీ కేసులో విచారణ అనంతరం ముద్దాయిలుగా నిర్ధారించి శిఖ ఆనంద్, పొన్నాడ కిరణ్, నలబంద సతీష్‌లకు ఎనిమిది నెలల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ. 2వేలు జరిమానా విధిస్తూ అదనపు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి.రమ్య మంగళవారం తీర్పు చెప్పారు. గత ఏడాది జూన్‌లో ఆలయంలో వారు ముగ్గురు చోరీకి పాల్పడి అమ్మవారి నగలు ఎత్తుకెళ్లారు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు ఒకటవ పట్టణ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటరావు చోరీకేసును ఛేదించారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ మృణాళిని వాదించారు.

అరటి పండ్ల దుకాణం ధ్వంసం చేసిన ఏనుగులు



వెంకటరాజపురంలో అరటితోట నుంచి బయటకు వస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని వెంకటరాజపురంలో మంగళవారం అరటి, జొన్న పంటలను ఏనుగులు ధ్వంసం చేయడమే కాకుండా పెదమేరంగి కూడలిలో ఉన్న అరటి పండ్ల దుకాణంలో పళ్లను తినేసి కాయలను ధ్వంసం చేశాయని వ్యాపారి అక్కేన త్రినాథ తెలిపాడు. షాపును కూడా ఏనుగులు ధ్వంసం చేసినట్లు వాపోయాడు. అటవీ సిబ్బంది తనకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

గ్రూప్ 4 పరీక్ష ప్రశాంతం

విజయనగరం అర్బన్: ఏపీపీఎస్సీ ద్వారా రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టులకు మంగళవారం జిల్లాలో నిర్వహించిన కంప్యూటర్ బేస్డ్ మెయిన్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని రాజాం జీఎంఆర్ పరీక్ష కేంద్రంలో రెండు సెషన్స్‌లోనూ 500 మందికి 461 మంది, ఆయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో 513 మందికి448 మంది, గాజులరేగ సీతం కాలేజీ పరీక్ష కేంద్రంలో 130 మందికి 111 మంది హాజరయ్యారని డీఆర్‌ఓ ఎం.గణపతి రావు తెలిపారు.

స్వామిత్వ సర్వే వేగంగా పూర్తి చేయండి : డీపీఓ నిర్మలాదేవి

గజపతినగరం: మండలంలో ఉన్న అన్ని గ్రామకంఠాలతో పాటు జగనన్న లేఅవుట్లపై స్వామిత్వ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నిర్మలాదేవి సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆమె గజపతినగరం గ్రామ సచివాలయం -2ను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఎన్‌జీఆర్ పురం గ్రామ సర్వే ఎంత వరకు వచ్చిందని సెక్రటరీలు, వీఆర్‌ఓను ఆరా తీశారు. గ్రామంలో ఉన్న ప్రతి ఇంటిని, ఖాళీ స్థలాన్ని క్షేత్రస్థాయిలో సర్వే చేసి వాటి హద్దులను నిర్ణయించాలని స్పష్టం చేశారు. సర్వే పూర్తయిన తరువాత ప్రతి స్థలానికి కొత్త సర్వే నంబర్, ఇళ్లకు డోర్ నంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన మ్యాప్‌ను పరిశీలించి వేగవంతంగా సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు.

దెబ్బకు రా.. బెట్టింగ్ ముఠా..!

- 11మంది అరెస్టు
- మరో 9 మంది కోసం గాలింపు
- రూ.34వేలు, టీవీ, మొబైల్ స్వాధీనం
- తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- డీఎస్పీ మోహనరావు, సీఐ నాగేశ్వర రావు



మాట్లాడుతున్న డీఎస్పీ మోహన రావు, సీఐ నాగేశ్వరరావు

బొబ్బిలి: పట్టణంలోని ఐటీఐ కాలనీ కేంద్రంగా ఐపీఎల్, ఇతర క్రీడల బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ముఠాలోని 11 మందిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ బి మోహన రావు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకరులకు కేసు వివరాలను వెల్లడించారు. పట్టణంలోని గొడవీధికి చెందిన కొట్నాన హరి కృష్ణ పట్టణంలోని ఐటీఐ కాలనీలో గల తనకు చెందిన మరో ఇంటిలో ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్టు గుర్తించామని చెప్పారు. ప్రధానంగా కోట్ల ఉషా కిరణ్ ఉరఫ్ బుజ్జి, చిత్రపు సాయి ప్రకాశ్, రాయపురెడ్డి శోభన్ బాబు, రామభద్రపురానికి చెందిన పెదపల్లి భాస్కరరావు, రామభద్రపురం మండలం చింతలవలసకు చెందిన అల్లాడ రమేష్, పట్టణంలోని రావు వారి వీధికి చెందిన పాలూరి గణేష్, మల్లంపేటకు చెందిన కళింగపట్నం పైడిరాజు, మెట్టవలసకు చెందిన నడిమింటి శివ, గొల్లవీధికి చెందిన ఊళ్ల మహేష్, నాయుడు కాలనీకి చెందిన బడ్డుకొండ అప్పారావులను అరెస్టు చేసి సెక్షన్ 3,4 కింద కేసులు నమోదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు.

విశాఖకు చెందిన బుకీతో లింకులు

విశాఖ పట్నానికి చెందిన ఐపీఎల్ బెట్టింగ్ బుకీతో స్థానికులు పరిచయాలు ఏర్పరచుకుని అతని ద్వారా డబ్బులు తీసుకోవడం, ఇవ్వడం చేస్తున్నారని డీఎస్పీ వివరించారు. స్థానికుల నుంచి ఒక యాప్ ద్వారా పందాలు నిర్వహిస్తున్నారని, ఐపీఎల్ మ్యాచ్‌లే కాకుండా ఇతర అన్ని క్రీడలపైనా వీరు బెట్టింగ్‌లు కాస్తున్నారని, ఈ క్రీడలు 365 రోజుల పాటు నడుస్తుండడంతో వీరు కూడా అన్ని రోజులూ పందాలు ఆడుతున్నట్టు గుర్తించామన్నారు. ప్రస్తుతం 11 మందిని అరెస్టు చేశామని, మరో తొమ్మిది మంది కోసం గాలిస్తున్నామని చెప్పారు.

2శాతం కమీషన్‌పై..

ఐపీఎల్ తదితర క్రీడలపై పందాల ఆసక్తి ఉన్న వారి దగ్గర డబ్బులు సేకరించి విశాఖలోని సబ్ బుకీలకు అప్పగించడం, వారి నుంచి గెలిచిన సొమ్మును తెప్పించి ఇవ్వడం వంటి పనులను మొత్తం సొమ్ముపై 2 శాతం కమీషన్‌కు బుజ్జి తదితరులు వసూలు చేస్తున్నారని సీఐ ఎం.నాగేశ్వర రావు వివరించారు.

తల్లిదండ్రులు దృష్టి సారించాలి

ఐపీఎల్ బెట్టింగ్‌ల బారిన పడుతూ యువత చెడు దారిన పడుతోందని తల్లిదండ్రులు వారి పిల్లలను జాగ్రత్తగా గమనిస్తుండాలని సీఐ ఎం నాగేశ్వరరావు హితవు పలికారు. ఇళ్ల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు ఎందుకు తీసుకువెళ్తున్నారో? బయట ఏమైనా అప్పులు చేస్తున్నారా? అన్నది గమనించాలని సూచించారు. చిన్న చిన్న పనులు చేసుకుంటున్న వారు సైతం ఈ ఊబిలో చిక్కుకుంటున్నారని, భవిష్యత్తులో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్త వహించాలని స్పష్టం చేశారు.

పూర్తిస్థాయిలో ట్యాబ్‌ల వినియోగం

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి
- కేజీబీవీ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

డెంకాడ: ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందజేసిన ఎంతో విలువైన కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పూర్తిస్థాయిలో వినియోగించేలా చూడాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. ఈ కంటెంట్‌లో ఉన్న ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన క్లాస్ టెస్టును విద్యార్థులు చేత చేయించాలని సూచించారు. ఈ మేరకు నెల్లిమర్ల పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్‌మీడియట్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులతో మాట్లాడారు. ఉన్నత విద్యపట్ల వారి భవిష్యత్ ప్రణాళికలను తెలుసుకున్నారు. కేవలం ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి కోర్సులే కాకుండా, సీఏ, లా తదితర ఎన్నో ప్రత్యామ్నాయ అవకాశాలు ఉన్నాయని సూచించారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇవ్వాలని, ఉపాధ్యాయులకు స్పష్టం చేశారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను పరిశీలించి వాటి వినియోగం, సబ్జెక్టు టెస్టుల నిర్వహణ, టెస్టుల్లో వచ్చిన మార్కులపై ఆరా తీశారు. ట్యాబ్ ద్వారా అందిస్తున్న కంటెంట్ అర్థమవుతోందా? అని విద్యార్థులను ప్రశ్నించారు. డిక్షనరీ వినియోగించే విధానాన్ని పరిశీలించారు. బాగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ తనిఖీలో ఎంపీడీఓ జి.గిరిబాల, ఎంఈఓ ఎ.కష్టారావు, కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.ఉమ పాల్గొన్నారు.



ఈవీఎం గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

ఈవీఎం గోదాముల తనిఖీ

నెల్లిమర్ల: పట్టణ పరిధిలోని మిమ్స్ సమీపంలో గల ఈవీఎం గోదాములను కలెక్టర్ ఎ.సూర్యకుమారి మంగళవారం పరిశీలించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. తనిఖీల్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, నెల్లిమర్ల తహసీల్దార్ రమణ రాజు, ఎంపీడీవో జి.గిరిబాల, మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నీలకంఠరావు, లోక్‌సత్తా నాయకురాలు రాయి పద్మావతి, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభా పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం



జోగింపేట గిరిజన ప్రతిభా పాఠశాల/కళాశాల



పి.వెంకటినాయుడు.ప్రిన్సిపాల్, జోగింపేట

సీతానగరం: మండలంలోని జోగింపేట గిరిజన ప్రతిభా పాఠశాలలో 8వ తరగతి, ఇంటర్మీడియట్ (ఎంపీసీ, బైపీసీ) మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ పి.వెంకటినాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ గిరిజన బాలుర భవిష్యత్‌కు బంగారు బాట వేసుకునే సువర్ణఅవకాశం కలిగించే జోగింపేట ఏపీటీడబ్ల్యూఆర్ స్కూల్ ఆఫ్ఎక్స్‌లెన్స్ సీతంపేట మండలం మల్లి ఏపీటీడబ్ల్యూఆర్ కాలేజీ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఇంటర్మీడియట్, 8వ తరగతిలో ప్రవేశంతో పాటు ఉచితవసతి, భోజన సౌకర్యాలతో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా విద్యనందిస్తూ ఐఐటీ, నీట్, ఈఏపీ సెట్ పరీక్షలకు ప్రత్యే కోచింగ్ ఇవ్వడానికి అవసరమైన స్టడీ మెటీరియల్‌ను, సమ్మర్‌కోచింగ్ అందించే సువర్ణ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా గిరిజన విద్యార్థులను కోరారు. జోగింపేట ప్రతిభా పాఠశాలనందు 8వ తరగతిలో 45 సీట్లు, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో 45,బైపీసీలో 45 సీట్ల భర్తీకి, మల్లి ప్రతిభా కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ 40 సీట్లు,బైపీసీ 40 సీట్లు భర్తీకి అర్హత కలిగిన గిరిజన బాలురనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు.

అర్హతలు ఇవే

- 2023-24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం 10వ తరగతి పరీక్షలు ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులు అర్హులు
- తల్లిదండ్రుల వార్షికాదాయం రూ 1,00,000లోపు కలిగి ఉండాలి.
- ఎంపికైన విద్యార్థుల కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు రేషన్‌కార్డు, ఆధార్, మార్క్స్ మెమో, స్టడీ, ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ సమర్పించాలి
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి అభ్యర్థులు ఆన్‌లైన్‌లో httpr://www.aptwgurukulam.ap.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరితేదీ 18.4.2023, హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు తేదీ 16.4.2023, ప్రవేశ పరీక్షతేదీ 23.4.2023గా స్పష్టం చేశారు.

స్థలసేకరణ వేగవంతం

- జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్



మెంటాడ హైస్కూల్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీఈఓ

మెంటాడ: హరిత జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మండలంలో స్థలాన్ని కోల్పోతున్న ప్రభుత్వ పాఠశాలలకు వీలైనంత వేగంగా స్థల సేకరణ చేసి మంజూరుచేయాల్సిన బాధ్యత సంబంధిత రెవెన్యూ అధికారులపై ఉందని జెడ్పీ సీఈఓ అశోక్ కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండల కేంద్రంలో ఆకస్మిక పర్యటించి ముందుగా ఉన్నతపాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జెడ్పీ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు ఆదేశాల మేరకు రహదారి విస్తరణలో స్థలం కోల్పోతున్న పాఠశాలలను పరిశీలించినట్లు చెప్పారు. మెంటాడ ఉన్నతపాఠశాల 1ఎకరా మేర స్థలం కోల్పోతుందని, అలాగే బిరసాడవలస గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మూడు సెంట్లు స్థలం కోల్పోతుందని గుర్తించినట్లు చెప్పారు. ఈ రెండు పాఠశాలలకు సంబంధించి వీలైనంత వేగంగా స్థల సేకరణ చేసి సంబంధిత యాజమాన్యానికి అప్పగించాలని రెవెన్యూ అధికారులను కోరినట్లు చెప్పారు. అలాగే మండలంలోని పలుగ్రామాల్లో చెత్తసేకరణ, పారిశుద్ధ్యం, తాగునీటి కుళాయిల అమలు తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయన్నారు. దీనిపై ఈనెలలో జిల్లా కేంద్రంలో జరిగే జెడ్పీ సమావేశంలో ఆదేశాలు జారీ చేస్తామని స్పష్టం చేశారు. ఈ పర్యవేక్షణలో తహసీల్దార్ ఆదిబాబు, ఎంపీడీఓ తివిక్రమ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అక్రిడిటేషన్ కమిటీలో ప్రాతినిధ్యం

- కలెక్టర్ సూర్యకుమారికి ఏపీయూడబ్ల్యూజే వినతి



వినతులను వింటున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార శాఖ విడుదల చేసిన అక్రిడిటేషన్ జీఓ మేరకు ఏర్పాటైన జిల్లా కమిటీలో ఏపీయూడబ్ల్యూజే వంటి పాత్రికేయ అతిపెద్ద సంఘానికి ప్రాతినిధ్యం ఇవ్వాలని ఆ సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ప్రతినిధులు మంగళవారం కలెక్టర్ ఎ.సూర్యకుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. పూర్తిస్థాయి కాలపరిమితితో అక్రిడిటేషన్ అందజేయాలని, చిన్న పత్రికలకు ప్రతి మండలంలో వంద పత్రికల సర్క్యులేషన్ ఉండాలన్న నిబంధనను తొలగించాలని కోరారు. ప్రస్తుత పరిస్థితులలో కొత్త కమిటీల ఏర్పాటు ఆలస్యం అవుతుందని అందువల్ల జూన్ వరకు అక్రిడిటేషన్ల గడువు పొడిగించాలని వినతి పత్రంలో కోరారు. ఏపీ సైబర్‌లో టెలికాస్ట్ అవుతున్న చానెల్స్ విలేకరులకు, నిబంధనల మేరకు రిజిస్టర్ అయిన ఎలక్ట్రానిక్ మీడియాను కూడా గుర్తించి అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దిమిలి అచ్యుతరావు, రాష్ట్ర కార్యదర్శి శివప్రసాద్, జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎమ్మెస్సెన్‌రాజు, జిల్లా కార్యదర్శి పంచాది అప్పారావు, సీనియర్ నాయకులు ఎలిశెట్టి సురేష్, టి.రాధాకృష్ణ, మహాపాత్రో, వైఎస్‌పంతులు, చక్రవర్తి, భరత్, త్రినాథ్, నాగరాజు, రవి, శర్మ, శ్రీనివాస్ ఉన్నారు.

ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజు రాయితీకి హామీ

జిల్లాలోని ప్రైవేట్ స్కూల్స్, కళాశాలల్లో పాత్రికేయుల పిల్లలకు ఫీజు రాయితీ సౌకర్యం కల్పించేందుకు కలెక్టర్ ఎ.సూర్యకుమారి హామీ ఇచ్చారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ తరఫున మంగళవారం ఈ మేరకు ప్రత్యేక వినతిపత్రాన్ని ఆమెకు సమర్పించారు. జిల్లాలోని పాత్రికేయుల పిల్లల వివరాలతో కూడిన జాబితాను అందజేస్తే సంబంధిత ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలతో మాట్లాడి గతంలో ఇచ్చినట్లే 50 శాతం ఫీజు రాయితీని కల్పించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ఈ మేరకు జాబితా రూపకల్పన చేస్తామని యూనియన్ ప్రతినిధులు తెలిపారు. జిల్లాలో ఇటువంటి ఫీజురాయితీ కావలసిన పాత్రికేయులు తమ పూర్తి వివరాలు, పిల్లల విద్య, విద్యాసంస్థల వివరాలను సంఘం సభ్యులు 9705346345, 9494165730 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి శివప్రసాద్, జిల్లా కార్యదర్శి పంచాది అప్పారావు కోరారు.

పాటూరు చెరువులో పురాతన శిలాశాసనం



పాటూరు కోనేరులో వెలుగుచూసిన శిలాశాసనం

వేపాడ: మండలంలోని పాటూరు గ్రామ సమీపంలో జగన్నాథస్వామి ఆలయం వెనుకన ఉన్న కోనేరులో ఉపాధిహామీ పనుల తవ్వకాల తో పురాతన శిలాశాసనం నాలుగురోజుల కిందట బయటపడింది. దీని ఫొటోను విశాఖ పురావస్తుశాఖ అధికారులకు ఆలయ అర్చకు డు ప్రసాదరావు పంపించారు. ఇది 11, 12వ శతాబ్దానికి చెందిన తూర్పు గాంగుల కాలానికి చెందినదిగా పురావస్తు శాఖ అధికారులు చెప్పినట్టు అర్చకుడు తెలిపారు.

సైకిల్‌పై శాంతి ర్యాలీ



విజయనగరం టౌన్: కర్ణాటకకు చెందిన విజయ్‌గోపాలకృష్ణ సైకిల్‌పై ప్రయాణిస్తూ దేశప్రజలకు శాంతి సందేశం వినిపిస్తున్నారు. ఒడిశా రా ష్ట్రం మీదుగా విజయనగరం జిల్లా ముడిదాం వద్ద ఆయన 'సాక్షి'తో మంగళవారం కాసే పు ముచ్చటించా రు. ఇప్పటివరకు 11 రాష్ట్రాల పర్యటన పూర్తయిందన్నారు. మత ఘర్షణలు, విధ్వంసాలులేకుండా ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో, ఆనందంగా ఉండాలని వివిధ రాష్ట్రాల్లోని ప్రముఖ దేవాలయాల్లో పూజలు చేస్తున్నట్టు తెలిపారు.

ముడిదాం సమీపంలో సైకిల్ యాత్ర చేస్తున్న గోపాలకృష్ణ

15 మంది సీఎస్‌డీటీలకు పని సర్దుబాటు

విజయనగరం అర్బన్: జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న 15 మంది సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ల (సీఎస్‌డీటీ)కు పనిసర్దుబాటు చేస్తూ జేసీ కె.మయూర్‌అశోక్ మంగళవారం ఆదేశాలు జారీచేశారు.

ఆయా మండలాల్లో పని డిమాండ్‌కు అనుగుణంగా అధికారులను సర్దుబాటుచేశారు. వీవీఆర్ జగన్నాథరావు (విజయనగరం), కొట్నాన శ్రీనివాసరావు (నెల్లిమర్ల, డెంకాడ), ఎన్‌వీవీఎస్ మూర్తి (ఎస్.కోట, ఎల్.కోట), జి.వి.భాస్కరరావు (తెర్లాం , బాడంగి), పి.రామారావు (చీపురుపల్లి, మెరకముడిదాం), పీ.సాయికృష్ణకుమార్ (బొబ్బిలి, రామభద్రపురం), డీవీరవిశేఖర్ (గజపతినగరం, బొండపల్లి), బి.వి.మురళీకృష్ణ (భోగాపురం, పూసపాటిరేగ), ఆర్.ధనం (దత్తిరాజేరు, మెంటాడ), కె.ఇందిర (గంట్యా డ), సీహెచ్.శోభారాణి (గరివిడి, గుర్ల), టి.రమేష్ (కొత్తవలస, వేపాడ), ఎస్.చిరంజీవిరావు (రాజాం, సంతకవిటి), బి.గోవిందరావు ను వంగరకు వేశారు. అలాగే, డీఎస్‌ఓ కార్యాయలంలో అసిస్టెంట్ సప్లై ఆఫీసర్‌గా పనిచేస్తున్న బి.అశోక్‌కు జామి సీఎస్‌డీటీగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ముగ్గురు అధికారులపై కేసునమోదు

జామి: భూ వివాదం కేసులో ముగ్గురు అధికారులతో పాటు మరో ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు జామి ఎస్సై వీరబాబు మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న 23 సెంట్ల భూమిని అమ్మకందారులు మరొకరి పేరున మార్చేశారని, తనకు న్యాయం చేయాలని మండలంలోని జేడీ వలస గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు గూనూరు బంగారు నాయుడు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనికి స్పందించిన సివిల్ కోర్టు..విశ్రాంత ఉపాధ్యాయుడు ఫిర్యాదు చేసిన సమయంలో పనిచేసిన తహసీల్దార్, ప్రస్తుత విశ్రాంతి తహసీల్దార్ భాస్కర్, డీటీ రమణరావు, ఎస్సై సుదర్శన్‌లపై కేసు నమోదు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ఎస్సై వీరబాబు ఆ ముగ్గురు అధికారులతో పాటు భూమిని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారంలో బాధ్యులైన ఆర్.చంద్రమ్మ, అచ్చింనాయుడు, ఆర్.రమలపై కేసు నమోదు చేశారు.

ఎస్‌టీఎస్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: క్షయ నివారణ శాఖలో సీనియర్ ట్రీటిమెంట్ సూపర్‌వైజర్ (ఎస్‌టీఎస్) పోస్టుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎస్.సూర్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు గత ఏడాది నంబర్ 9న ఇచ్చిన నోటిఫికేషన్ అనివార్య కారణాల వల్ల రద్దయిందని, కలెక్టర్ ఆదేశాల మేరకు మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చినట్టు వెల్లడించారు. దరఖాస్తులు ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు స్వీకరిస్తామని చెప్పారు. పోస్టుకు సంబంధించిన దరఖాస్తులు, ఇతర వివరాలను విజయనగరం .ఎన్‌ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు.

షిప్ మంత్ర యాప్‌తో కార్గో సేవలు

- యాప్‌తో ఆన్‌లైన్ బుకింగ్‌ను ప్రారంభించిన ఈడీ రవికుమార్



షిప్‌మంత్ర యాప్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఈడీ సీహెచ్ రవికుమార్, తదితరులు

విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ కార్గో సేవలను మరింత విస్తృతం చేసేందుకు షిప్ మంత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని ఆర్టీసీ ప్రజారవాణాశాఖ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్.రవికుమార్ తెలిపారు. శాఖ కార్యాలయ ఆవరణలో మంగళవారం షిప్ మంత్ర యాప్ సేవల కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం నుంచి విశాఖపట్టణం, రాజమండ్రి, కాకినాడ, విజయవాడ పట్టణాలకు యాప్ ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. విజయనగరం నుంచి కూడా సేవలు అందిస్తామని చెప్పారు. యాప్‌లో 50 కిలోల వరకు 7 కిలోమీటర్ల పరిధిలో వెబ్‌సైట్‌లో బుక్ చేసుకుంటే డోర్ పికప్, డోర్ డెలివరీ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. వినియోగదారులు షిప్ మంత్ర డాట్ కామ్ ద్వారా గానీ, ఏపీఎస్ఆర్‌టీసీ లాజిస్టిక్ డాట్ ఇన్ వెబ్‌సైట్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జోన్ కమర్షియల్ సీటీఎం కె.వెంకటరావు, జిల్లా ప్రజారవాణాధికారి కె.శ్రీనివాసరావు, నెక్ రీజియన్ ఏటీఎమ్, కమర్షియల్ హెచ్.దివ్య, డిపోమేనేజర్ జె.శ్రీనివాసరావు, షిప్ మంత్రా యాప్ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కనువిందుగా దండి మార్చ్ విగ్రహాలు

విజయనగరం జిల్లా కేంద్రంలోని ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద రూపుదిద్దుకుంటున్న దండిమార్చ్ మహాత్ముల విగ్రహాలు కనువిందు కలిగిస్తున్నాయి. ఆ విగ్రహాలను తిలకిస్తున్న చూపరులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం



దండిమార్చ్ మహాత్ముల విగ్రహాలు



నడిరోడ్డులో ఆకర్షణీయంగా విగ్రహాలు



విగ్రహాలు, వాటర్ ఫౌంటైన్ పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

పుష్పాలంకరణలో పైడితల్లి



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో భక్తులకు మంగళవారం దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద మహిళలు దీపారాధనలు చేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.